క్లుప్తంగా

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి జాతర


రాజ్యలక్ష్మి అమ్మవారు

అంబాజీపేట: తొండవరంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారి పూజ ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే అమ్మవారి జలకం 29న జరుగుతుందన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించి వారిని చైతన్య పరచాలని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి డయేరియాపై అవగాహన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి, ఆరు బయట ఆహార పదార్థాలు ఏమి తినకూడదు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయా గ్రామాల్లోని ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలన్నారు. ప్రతి ఇంటినీ సర్వే చేస్తూ వ్యాధి లక్షణాలను వివరించాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, పీహెచ్‌ఎన్ రత్న కుమారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి

సఖినేటిపల్లి: ఉపాధి బకాయి వేతనాలు చెల్లించి కూలీలను ఆదుకోవాలని సదరు సంఘ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మోరిపోడులో మేట్ గెడ్డం దేవి అధ్యక్షతన ఉపాధి కూలీల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు ఏడు వారాల నుంచి వేతనాలు అందలేదని, ప్రస్తుతం ఎనిమిదో వారం పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధి పని చేసిన 15 రోజులకు వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ చట్టం చెబుతున్నప్పటికీ, అధికారుల ఉదాసీన వైఖరి వల్ల వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీనివాసరావు తెలిపారు. తక్షణం వేతనాలు అందే విధంగా ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన కోరారు. లంకే తాత రాజు, కుసుమ రమేష్, చెల్లుబోయిన శ్రీనివాస్, బొమ్మిడి శాంతమ్మ పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం

మామిడికుదురు: నగరం గ్రామంలోని శ్రీహరి క్షేత్రంలో కొలువుదీరిన హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ 14వ వార్షికోత్సవంలో భాగంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం భక్తుల కోలాహలం, వేద మంత్రాల నడుమ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం జరిగిన హోమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు మార్గదర్శిగా నేషనల్ వర్కర్స్ ట్రస్ట్

రాజోలు: ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లే వలస కార్మికులకు నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్(ఎన్‌డబ్ల్యూడబ్ల్యూటీ) మార్గదర్శిగా నిలుస్తుందని జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. సోమవారం రాజోలులో విదేశాలకు వెళ్లే వలస కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కువైట్ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారికి ఆ ప్రభుత్వం మూడు నెలలు క్షమాభిక్ష ప్రకటించిందన్నారు. అలాంటి వారు ఎవరైనా కువైట్‌లో ఉంటే కొంతమేర జరిమానా చెల్లిస్తే కువైట్‌లో నివసించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. అలా కాని పక్షంలో స్వేచ్ఛగా స్వదేశానికి వచ్చేందుకు వీలు కలుగుతుందన్నారు. ఎంతో మంది కువైట్ వెళ్లి మోసపోయి దొంగచాటుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అటువంటి వారికి కువైట్ దేశం ప్రకటించిన క్షమాభిక్ష సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ లిస్సీ జోషి, దిండి సర్పంచ్ ముదునూరి శ్రీనురాజు, ట్రస్ట్ లీగల్ సలహాదారుడు నల్లి శంకర్, కో–ఆర్డినేటర్ సీహెచ్ రవికుమార్, మోహన్, సరోజని, వెంకటలక్ష్మి, విజయ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

ఆలమూరు: డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపించి యువతను మెరుగైన జీవితాన్ని అందిద్దామని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ అన్నారు. మండలంలోని కొత్తూరు సెంటర్‌లో డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ మండలంలోని కొత్తూరు, చెముడులంక గ్రామాల్లో సోమవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. డ్రగ్స్ వద్దు– జీవితం ముద్దు అనే నినాదంతో ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు యువత మేలుకో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

అధ్వానంగా అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు

- శిథిలస్థితిలో ఉన్న వైనం
- రైతులకు తప్పని ఇబ్బందులు


అధ్వానంగా ఉన్న కడలి అవుట్ ఫాల్ స్లూయిజ్

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరంలో అధ్వానంగా మారిన అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాడబోది, వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్లపై నిర్మించిన స్లూయిజ్‌లతో పాటు కడలి మీడియం డ్రైన్‌పై నిర్మించిన స్లూయిజ్‌కు కాలం చెల్లిపోయింది. మూడు అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు పాడై పోవడంతో రైతులు ఏటా ముంపు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వైనతేయ గోదావరి నదీ తీరంలో మూడు మీడియం డ్రైన్లు ఉన్నాయి. వాడబోది, వాడ్రేవుపల్లి, కడలి మీడియం డ్రైన్లు ఉన్నాయి. ఈ డ్రైన్ల ద్వారా గోదావరి పాటు సమయంలో ముంపునీరు నదిలోకి దిగుతుంది. పోటు సమయంలో నదిలో నుంచి నీరు డ్రైన్‌లోకి రాకుండా షట్లర్లు మూసేస్తారు. ఈ పనులను నియంత్రించేందుకు అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు ఉపయోగపడతాయి. నదీతీరంలో ఉన్న మూడు స్లూయిజ్‌ల పరిస్థితి అధ్వానంగా ఉండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ స్లూయిజ్‌ల షట్టర్లతో పాటు వీటి శ్లాబ్ కూడా పాడైపోయింది. అనుక్షణం షట్టర్లు మొరాయిస్తూ రైతులకు కడగండ్లను మిగులుస్తున్నాయి.

20 వేల ఎకరాల ఆయకట్టు..

వాడబోది, వాడ్రేవుపల్లి, కడలి మీడియం డ్రైన్ల నుంచి 20 వేలకు పైబడిన ఆయకట్టుకు చెందిన ముంపు నీరు గోదావరి నదిలోకి దిగాల్సి ఉంది. ఆదుర్రులోని వాడబోది మీడియం డ్రైన్ ద్వారా 8,050 ఎకరాలు, అదే గ్రామంలోని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్ ద్వారా 5,200 ఎకరాలు, మగటపల్లి–గోగన్నమఠం గ్రామాల సరిహద్దులోని కడలి మీడియం డ్రైన్ ద్వారా 7,050 ఎకరాల ఆయకట్టుకు చెందిన ముంపునీరు దిగాల్సి ఉంది. అవుట్ ఫాల్ స్లూయిజ్‌లకు కాలం చెల్లడంతో పాటు షట్టర్లు సక్రమంగా పని చేయకపోవడం రైతులను కలవరపెడుతున్నాయి.

రైతులకు ఏటా ముంపు పాట్లే

మూడు స్లూయిజ్‌ల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ స్లూయిజ్‌ల షట్టర్లు పూర్తిగా మొరాయిస్తున్నాయి. దీంతో పాశర్లపూడి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మాకనపాలెం, కొమరాడ, ఈదరాడ, మగటపల్లి గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో పంట ఏటా ముంపునకు గురవుతోంది. దీనిపై రైతుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతుంది. స్లూయిజ్‌ల పరిస్థితిపై హెడ్ వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎన్ మూర్తిని వివరణ కోరగా వైనతేయ, వశిష్ఠ తీరాల్లోని నాలుగు అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల పునర్నిర్మాణానికి రూ.12.36 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి పంపించామన్నారు.

ఎస్సైకి సన్మానం


మలికిపురం ఎస్సై సంపత్ కుమార్‌ను సన్మానిస్తున్న పోలిశెట్టి గణేశ్ తదితరులు

మలికిపురం: 2024 సార్వత్రిక ఎన్నికల విధి నిర్వహణలో సక్రమంగా చేసి ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసిన పోలీస్ వ్యవస్థలోని మలికిపురం ఎస్సై సంపత్‌కుమార్‌ను సోమవారం విద్యార్థి సంఘాలు సన్మానించాయి. విద్యార్థి సంఘ నాయకులు గణేష్ పోలిశెట్టి అధ్వర్యంలో స్థానిక స్టేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ విద్యార్థి నాయకులు చొప్పాల రామకృష్ణ, పొన్నమండ సత్య, తాడి శ్రీకాంత్, దొంగ బన్ను, కుడిపూడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు

అంబాజీపేట: ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామంలోను పారిశుధ్య పనులు చేపట్టి శానిటేషన్ చేయాలని దీనిపై ఎవరూ అలసత్వం వహించవద్దని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డయేరియా నిర్మూలనపై పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న మంచి నీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. ప్రజలకు సురక్షిత మంచి నీరు అందించడమే లక్ష్యంగా ఉండాలన్నారు. మంచి నీటి ట్యాంకుల నుంచి వెళ్లే పైపులైన్లు కొన్ని ప్రాంతాల్లో శిథిలమైపోవడంతో నీరు వృథాగా పోతుందన్నారు. శిథిలమైన ప్రాంతంలో నీరు వెళ్లకుండా నిలుపుదల చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పలు అధికంగా కనబడుతున్నాయని వాటిని సత్వరమే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తకుప్పలు ఉన్న ప్రాంతాల్లో చెత్తకు నిప్పు పెట్టకుండా డంపింగ్ చేయాలన్నారు. డయేరియాతో పాటు డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడకుండా పారిశుధ్య పనులు చేయాలన్నారు. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచీ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అమలాపురానికి చెందిన ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ కొప్పినీడి వెంకటరమణకుమార్ విద్యార్థులకు ఉద్బోధించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పలివెల గ్రామానికి చెందిన యర్రాప్రగడ సుబ్రహ్మణ్యం, శేషమాణిక్యాంబ దంపతుల కుమారులు తమ తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఏటా స్థానిక ప్రభుత్వ బాలుర, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నారు. బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఎలుగుబంటి రోహిత్ వెంకట్, బాలికల పాఠశాల నుంచి యజ్ఞత ఉత్తమ ఫలితాలతో ప్రథమ స్థానాలు సాధించారు. వారికి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు డాక్టర్ రమణకుమార్ దంపతుల చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జేవీ సోమయాజులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కొత్తపేటలో ఉత్తమ విద్యార్థులకు నగదు అందజేస్తున్న డాక్టర్ రమణకుమార్ దంపతులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి


పొన్నమండలో నేను బడికి పోతా ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాజోలు: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్పించాలని మండల పరిషత్ అధ్యక్షుడు కేతా శ్రీనివాస్ అన్నారు. సోమవారం పొన్నమండ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల్లో అందిస్తున్న సౌకర్యాలను ప్రధానోపాధ్యాయిని ఆరుమిల్లి రోహిణి వివరించారు. స్టూడెంట్ కిట్, పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. బడి బయట ఉన్న పిల్లల్ని కచ్చితంగా పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు నల్లి మనోహరం, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే గిడ్డి


పి.గన్నవరంలో ఎమ్మెల్యే గిడ్డిని సత్కరిస్తున్న కూటమి నాయకులు

పి.గన్నవరం: నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి విచ్చేసిన గిడ్డికి సోమవారం జి.పెదపూడిలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి పి.గన్నవరం మీదుగా పోతవరం వరకూ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూల మాలలు, నివాళులు అర్పించారు. పోతవరం లేఅవుట్‌లో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అధ్యక్షతన జరిగిన రాత్రి బహిరంగ సభలో గిడ్డిని కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. గిడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు డొక్కా నాథ్ బాబు, యాళ్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు. విజయోత్సవ ర్యాలీలో బెల్లంపూడి వద్ద జరిగిన ప్రమాదంలో ఒక కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ర్యాలీలో నడచి వెళ్తున్న ఎం.శ్రీనివాస్ అనే కార్యకర్త కాలుపై వ్యాన్ ముందు చక్రం ఎక్కింది. దీంతో శ్రీనివాస్ కాలికి తీవ్ర గాయం కావడంతో అతడిని స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారి రాఘవేంద్రరావు క్షతగాత్రునికి ఆపరేషన్ చేసి, పోలీసులకు సమాచారం అందించారు.

గడువును సద్వినియోగం చేసుకోవాలి


ముఖాముఖి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

సఖినేటిపల్లి: స్వచ్ఛందంగా కువైట్ దేశం విడిచి వెళ్లేందుకు ఆ దేశం రాజు ఇచ్చిన గడువును అక్కడ చిక్కుకుపోయిన బాధిత కుటుంబ సభ్యులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, సీనియర్ అడ్వొకేట్ కుడుపూడి సూర్యనారాయణరావు సూచించారు. ఆదివారం రాత్రి మోరి వీ కన్వెన్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, సీనియర్ అడ్వొకేట్ కుడిపూడి సూర్యనారాయణరావు ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కువైట్ ప్రభుత్వం ఈ నెల 30వ తేదీలోపు ఎటువంటి కాగితాలు, ఆధారాలు లేకపోయినా ఆ దేశంలో చిక్కుకుపోయిన వారు దేశం విడిచి వెళ్లిపోవచ్చని క్షమాభిక్ష ఇప్పటికే ప్రకటించిందన్నారు. అయితే కువైట్‌లో భాష రాక, పేపర్లు చదువుకోలేక, అమాయకత్వంతో అక్కడ చిక్కుకుని ఉన్నవారు కువైట్ రాజు ఇచ్చిన గడువు అవకాశం సద్వినియోగం చేసుకోలేని స్థితిలో ఉన్నారని ఆయన అన్నారు. ఈ కోవకు చెందిన వారి కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, బాధిత కుటుంబ సభ్యుల చొరవతో సదరు వ్యక్తులను గడువులోగా స్వగ్రామాలకు రప్పించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాబీ గాబ్రియల్, ఓగూరి ఆక్రోష్, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

పది గ్రామాల్లో సామాజిక తనిఖీలు

అయినవిల్లి: మండలంలోని పది గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో 2023–24లో జరిగిన పనుల పై సోమవారం సామాజిక తనిఖీల బృందం తనిఖీలు నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ వి.కనకరావు ఆధ్వర్యంలో డీఆర్‌పీల పర్యవేక్షణలో పది బృందాలుగా ఏర్పడి విలేజ్ సోషల్ ఆడిటర్స్ సాయంతో పోతుకుర్రు, శంకరాయగూడెం, మడుపల్లి, చింతనలంక, వెలువలపల్లి, నల్లచెరువు, మాగాం, వీరవల్లిపాలెం గ్రామాల్లో క్షేత స్థాయిలో తనిఖీలు చేశారు. తనిఖీల్లో వెలువడిన అంశాలను నివేదికల ద్వారా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసి ప్రజా ప్రతినిధులకు, అధికారులను వివరిస్తామన్నారు.

బెల్లంపూడిలో విజృంభిస్తున్న విష జ్వరాలు

పి.గన్నవరం: మండలంలోని బెల్లంపూడి అంబేడ్కర్ కాలనీలో గత కొన్ని రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వర పీడితులు పి.గన్నవరం, అమలాపురం ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సోమవారం పి.గన్నవరం సీహెచ్‌సీలో పలువురు చికిత్స చేయించుకున్నారు. సుమారు 20 మందికి పైగా జ్వరాల బారిన పడినట్టు స్థానికులు తెలిపారు. కాలనీలో కొన్ని రోజులుగా జ్వరాలు తగ్గక పోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జ్వర పీడితులకు ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రి, పి.గన్నవరంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో పలువురు చికిత్స పొందుతున్నారని కాలనీ వాసులు తెలిపారు. వైద్య అధికారులు స్పందించి జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు


కొత్తపేటలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

కొత్తపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) దృష్టికి వచ్చిన ప్రజా ఫిర్యాదులపై తక్షణం స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని ఖండ్రిగ గ్రామానికి చెందిన రైతులు వచ్చి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రభుత్వం కొనుగోలు చేసిన రబీ (దాళ్వా) ధాన్యానికి సంబంధించి రైతులకు అకౌంట్లలో డబ్బులు జమ కాలేదని వాపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ (తొలకరి) సీజన్ ప్రారంభమైందని, ఈ పంట పెట్టుబడులకు డబ్బులు కావాలని, వెంటనే ఆ ధాన్యం డబ్బులు జమ చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ కేంద్రం, మేజర్ పంచాయతీ కొత్తపేటలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజ్ సమస్యపై గ్రామస్తులు ఏకరవు పెట్టారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై ఎక్కడికక్కడ వర్షం నీరు, డ్రైన్ వాటర్ నిలిచిపోయి దోమలు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే డ్రైనేజీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు.

మంచినీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలి


అయినవిల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న డీపీఓ డి.రాంబాబు

అయినవిల్లి: మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు, మంచి నీటిని సరఫరా చేసే పైపులైన్లు, గ్రేట్ వాల్స్ ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, అలాగే శుభ్రం చేయాలని డీపీఓ డి.రాంబాబు అన్నారు. సోమవారం ఆయన అయినవిల్లి, వీరవల్లిపాలెం, అయినవిల్లిలంకలోని ఓవర్ హెడ్ ట్యాంకులను , పైపులైన్‌లను పరిశీలించారు. వీటి శుభ్రతను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీలు నిర్వహిస్తున్న మంచినీటి సరఫరా చేస్తున్న పైపులైన్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు రామచంద్రరావు, సూర్యనారాయణమూర్తి, రవి తదితరులు ఉన్నారు. అనంతరం తొత్తరమూడిలో సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ను పరిశీలించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: గ్రామాలలో తాగునీటి సరఫరాలో ప్రధానమైన ఓవర్ హెడ్ ట్యాంకులను జిల్లా కలెక్టర్ ఆదేశాలపై సోమవారం పర్యవేక్షణ అధికారి, ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ పరిశీలించారు. ఇందులో భాగంగా అంతర్వేదికర పంచాయతీలోని ఐదు ట్యాంకులను, పల్లిపాలెంలోని రెండు ట్యాంకులను ఆయన నిశితంగా చూశారు. ట్యాంక్‌ల సామర్థ్యం, ట్యాంక్‌ల చుట్టూ పరిసరాలు పరిశుభ్రతలను పరిశీలించారు. వీటితో పాటు ట్యాంక్‌ల క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్ రిపోర్టులను సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శి వైవీవీ కుమార్, సిబ్బంది శ్యాంబాబు, శేఖర్, రాంబాబు, సూర్యప్రకాశరావు, వీఆర్వో రమ్య, వాటర్ ట్యాంకుల ఆపరేటర్స్ పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతిష్టాత్మక కార్యాచరణ ప్రణాళిక చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్ బాబుతో కలసి సోమవారం పాశర్లపూడి కొట్టుమెరకలో ఉన్న సమగ్ర మంచినీటి ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు నిర్వహణపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీపీఓ రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో 840 ఓహెచ్ఎస్‌లు ఉన్నాయని చెప్పారు. వాటిని ప్రతి 10 నుంచి 15 రోజులకు విధిగా శుభ్రం చేయాలని సూచించామన్నారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. దీనిని నివారించేందుకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టడం, తాగునీటి లీకేజీలను అరికట్టడం, పైప్ లైన్లకు ఎప్పటికప్పుడు రిపేర్స్ నిర్వహించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ, మండల పరిషత్ ఏఓ కె.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు ఉన్నారు.